సాక్షి
కాకినాడ
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



మాతృత్వానికి మరో మెట్టు!

కాకినాడ జీజీహెచ్‌లో తల్లిపాలు పొంద లేని శిశువులకు పాలందిస్తూ ధాత్రి మదర్ మిల్క్ బ్యాంక్ విశేష ఆదరణ పొందింది.




అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

గడియ వేసి ఉన్న ఇళ్ల తలుపుల బోల్ట్‌లు, ఐరన్ రాడ్‌లతో తలుపుల గెడలు తీయడంలో సిద్ధహస్తులైన ముగ్గురు దొంగలు పోలీసులకు పట్టుబడ్డారు.

8లో

నీటి విడుదల నిలిపివేత



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. జూన్ నెలలో ఖరీఫ్ సాగుకు తిరిగి నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

దుర్గామాతలకు ఘనంగా హోమాలు



కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతలుగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి, తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి చైత్ర అమావాస్య పర్వదినం సందర్భంగా ఆదివారం ఘనంగా ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం పండితులు ప్రత్యంగిర హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. కాగా, పది రోజులుగా తొలి పావంచా వద్ద కనకదుర్గ అమ్మవారికి నిర్వహిస్తున్న చైత్ర మాస పూజలు ఆదివారం నిర్వహించిన చండీహోమంతో ముగిశాయి. ఉదయం 9 గంటలకు అమ్మవారికి పూజలు చేసిన అనంతరం చండీహోమం నిర్వహించారు. సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, చెల్లపిళ్ల ప్రసాద్, కనకదుర్గ ఆలయ అర్చకుడు చిట్టెం హరగోపాల్, పరిచారకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమం అనంతరం పండితులు వేదాశీస్సులు అందజేసి, ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. కనకదుర్గ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. దేవస్థానం ఏఈఓ కె.కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లోవకు పోటెత్తిన భక్తులు



పూలమాలాలంకరణలో తలుపులమ్మ అమ్మవారి సన్నిధి

తుని: తలుపులమ్మ లోవకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అమ్మవారిని 25 వేల మంది భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారని కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,21,500, పూజా టికెట్ల ద్వారా రూ.73,380, కేశఖండన టికెట్ల ద్వారా రూ.8,940, వాహన పూజలకు రూ.1,730, కాటేజీల ద్వారా రూ.33,060, విరాళాలు రూ.66,458 కలిపి మొత్తం రూ.3,05,068 ఆదాయం సమకూరిందని వివరించారు. గంధామావాస్య సందర్భంగా అమ్మవారిని, ఆలయాన్ని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు.

కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్‌ఎస్

కాకినాడ సిటీ: జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకూ నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. అలాగే, మండల స్థాయిలో జరిగే పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ విధిగా ఉదయం 9.30 గంటలకే హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వాయిదాల పద్ధతితో తల్లులకు పంగనామం



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి పార్టీల నేతలు విఫలమవుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆదివారం విమర్శించారు. తల్లికి వందనం పథకం సొమ్మును వాయిదాల పద్ధతిలో ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం తల్లులకు పంగనామం పెట్టినట్టే అవుతుందని అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చేందుకు ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. అమ్మ ఒడి పేరిట పిల్లల చదువులకు భరోసా ఇచ్చారన్నారు. కూటమి పాలకులకు ప్రజలే గుణపాఠం చెబుతారని నాగమణి అన్నారు.

ఇదేందయ్యా ఇది.. ఇదెప్పుడూ చూడలే..



చలివేంద్రంలో చుక్క నీరు కూడా లేని వాటర్ క్యాన్లు

వేసవి ఎండలు మండిపోతున్నాయి.. అందులోనూ సముద్ర తీరానికి కాస్త చేరువలో ఉన్న పిఠాపురం ప్రజలైతే ఓవైపు ఎండ.. మరోవైపు తీవ్ర ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు, ముఖ్యంగా బాటసారుల ఇబ్బందులు తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం.. అందులో చల్లని నీటిని అందుబాటులో ఉంచడం ప్రభుత్వ కనీస బాధ్యత. కానీ, పిఠాపురం మున్సిపల్ అధికారులు చుక్క నీరు లేకుండానే చలివేంద్రాలు నిర్వహిస్తున్నట్టున్నారు. ఈ చిత్రాలు చూస్తే అలాగే అనిపించక మానదు. స్థానిక పాదగయ క్షేత్రం సెంటర్‌లో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రానికి ప్రతి రోజూ వేలాదిగా భక్తులు వస్తూనే ఉంటారు. వారు తమ దాహార్తిని తీర్చుకునేందుకు ఈ చలివేంద్రం వద్దకు వస్తే అక్కడ ఖాళీ వాటర్ క్యాన్లు దర్శనమిస్తూండటంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. మున్సిపల్ అధికారులు మొక్కుబడిగా చలివేంద్రం ఏర్పాటు చేసి, అందులో నీరుందో లేదో కూడా పట్టించుకోకుండా చేతులు దులిపేసుకున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు. – పిఠాపురం



ఓ క్యాన్ నుంచి గుక్కెడు నీరు పట్టుకునేందుకు బాటసారి అవస్థలు

ఉపాధికి సమాధి!



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించని సర్కారు
- జిల్లాలో రూ.18 కోట్లకు పైగా బకాయిలు
- ఉసూరుమంటున్న ఉపాధి కూలీలు
- రెక్కలు ముక్కలు చేసుకున్నా తప్పని పస్తులు

పిఠాపురం: శ్రమజీవుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సుమారు రెండు దశాబ్దాల కిందట కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బృహత్తర పథకం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. గ్రామీణ శ్రమజీవులకు కనీస వేతనంతో ఏడాదికి వంద రోజుల పని తప్పనిసరిగా కల్పించే లక్ష్యంతో దీనిని చట్టంగా రూపొందించారు. దీని ఫలితంగా, తిన డానికి తిండి కూడా దొరకని లక్షలాది మంది నిరుపేదల ఉపాధికి గ్యారంటీ లభించింది. ఈ పథకం ద్వారా నిరంతరం చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామసీమల రూపురేఖల్లో ఊహించని మార్పులు వచ్చాయి. అయితే, పథకం ఎంత గొప్పదైనా పాలకుల తీరు సరిగ్గా లేకపోతే అది నిర్వీర్యం కావడం ఎంతోసేపు పట్టదు. ఈ పథకం విషయంలో ప్రస్తుతం అదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

శ్రమజీవులతో సర్కారు చెలగాటం

గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వ్యవసాయ కార్మికులందరూ ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చెరువులు, కాలువల్లో పూడికల తొలగింపు, గట్ల పటిష్టత, సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, నీటి తొట్టెల నిర్మాణం వంటి పనులు చేస్తున్నారు. గత మార్చితో ముగిసిన 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 387 గ్రామాల్లో లక్షలాది మంది కూలీలు వివిధ ఉపాధి పనులు నిర్వహించారు. దీనికోసం రెక్కలు ముక్కలు చేసుకున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు నిర్దేశిత పనులు పూర్తి చేసిన 15 రోజుల్లోగా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలి. కానీ, జిల్లాలో గత జనవరి నెల నుంచి ఇప్పటి వరకూ నయాపైసా కూడా చెల్లించడం లేదు. అప్పటి నుంచీ తమ ఖాతాల్లో వేతనాలు జమ కాకపోవడంతో కూలీలు గగ్గోలు పెడుతున్నారు. ఒక కూలీ వారంలో 6 రోజుల పాటు పనికి వెళ్తే.. రోజుకు రూ.270 నుంచి రూ.280 చొప్పున వారానికి రూ.1,680 వరకూ వేతనం వస్తుంది. దీని ప్రకారం ఒక్కో ఉపాధి కూలీకి 14 వారాలకు కలిపి సుమారు రూ.17 వేల వరకూ వేతనాల రూపంలో అందాల్సి ఉంది. ఈవిధంగా జిల్లా వ్యాప్తంగా రూ.18.02 కోట్లు పైనే వేతన బకాయిలున్నాయని అధికారులు చెబుతున్నారు. నిధుల కొరత పేరుతో తమ జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఎటువంటి సౌకర్యాలూ లేకపోయినా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి పనులకు వెళ్తూ అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. కష్టపడి చేసిన పనికి సకాలంలో వేతనం రాకపోవడంతో కడుపు నిండక పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు.

తగ్గిపోయిన కూలీలు

నాలుగు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో ఆ ప్రభావం స్పష్టం కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల గుర్తింపు జిల్లాలో ఇప్పటికే పూర్తయింది. అధికారులు పనులు అరకొరగానే కల్పిస్తున్నారు. ఫలితంగా గతంలో లక్షలాది మంది ఉపాధి హామీ పనులు చేయగా.. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9 వేల మంది మాత్రమే ఈ పనులకు వస్తున్నారు. నెల రోజులుగా ఎండలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో పని ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయిందని తెలుస్తోంది.

జిల్లాలో ఉపాధి హామీ పథకం వివరాలు

పనులు నిర్వహిస్తున్న మండలాలు	20
పనులు జరుగుతున్న గ్రామాలు	387
జాబ్ కార్డులు	2.84 లక్షలు
పని చేస్తున్న కూలీలు	4.58 లక్షల మంది
ప్రతి రోజూ పనికి వస్తున్న కూలీలు	3 లక్షల మందికి పైగా
వేతన బకాయిలు	రూ.18 కోట్లకు పైగా

వెంటనే వేతనాలివ్వాలి



గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలు చేసిన పనులకు వేతనాలు రాలేదు. చట్టప్రకారం 15 రోజులకే వేతనాలు ఇవ్వాలి. కానీ, నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం చాలా విచారకరం. ఏరోజుకారోజు రెక్కాడితేనే కానీ డొక్కాడని కూలీలు నెలల తరబడి వేతనాలు రాకపోతే ఏం తిని బతుకుతారు? వారికి కల్పించాల్సిన సదుపాయాలు, మెడికల్ కిట్లు, మేట్లకు పారితోషికాలు కూడా ఇవ్వడం లేదు. ఇవన్నీ ఇవ్వాలని చట్టంలో ఉన్నా అమలు చేయడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి పెంచకపోగా ప్రభుత్వం చెబుతున్న కనీస వేతనం రూ.300 కూడా ఇవ్వకపోవడం చాలా దుర్మార్గం. దీనిని బట్టి వ్యవసాయ కార్మికులు, పేదలపై ఈ ప్రభుత్వాలకు ఎటువంటి ప్రేమ ఉందో అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కూలీలకు రావాల్సిన వేతన బకాయిలు సుమారు రూ.200 కోట్లు. సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, నీటి తొట్టెల నిర్మాణం తదితర పనులకు రావలసిన మెటీరియల్ కాంపొనెంట్ నిధులు సుమారు రూ.2 వేల కోట్లు. ఇవన్నీ వెంటనే విడుదల చేయాలి.

– టేకుమూడి ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

మా కడుపు మాడుస్తున్నారు



ఆ కూలి డబ్బులిస్తేనే మా జీవనం సాగుతుంది. మా కడుపు నిండుతుంది. మా బతుకులు బాగు చేయడానికని అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం తగదు. ఒక రోజు కూలి రాకపోతేనే పస్తులు తప్పని దుస్థితి మాది. అటువంటిది 14 వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇలాగైతే మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? పేదల బతుకులతో ఆటలాడటం ప్రభుత్వానికి మంచిది కాదు. ఇప్పటికైనా మాకు వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి.

– రేగాడి చిన వెంకన్న, బీవీ లంక, కోరంగి

కూలి ఇవ్వకపోతే ఎలా బతకాలి?



ఉపాధి పని మీదే ఆధారపడి బతికే బతుకులు మావి. అందుకే మా జీవితాలకు దీనిని ఒక వరంగా భావిస్తాం. అదే మాకు కడుపు నిండా అన్నం పెడుతుంది. కానీ, ఈ పనులు చేస్తూంటే వారాలు, నెలల తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోతే మేమెలా బతకాలి? నిరుపేదల కడుపు నింపే ఉపాధి హామీ పథకాన్ని ఇలా డబ్బులు లేని పథకంగా మార్చేయడం దారుణం. వెంటనే మా డబ్బులు మాకు వేయాలి.

– పొట్లకాయల కృష్ణ, గొర్రెపూడి, కరప మండలం

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు



వీఎల్ఎన్‌ఎస్‌వీ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ నుంచి ఆదేశాలు వచ్చాయి. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా, వారిలో పఠనాశక్తిని కలిగించి, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ శిబిరాల నిర్వహణకు జిల్లా గ్రంథాలయ సంస్థ సమాయత్తమైంది. వివిధ అంశాలపై 40 రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తారు. తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకూ అని షెడ్యూల్ ప్రకటించినా, వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ మాత్రమే నిర్వహించనున్నారు. పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్నవారికి చెస్, క్యారమ్స్ వంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు. అలాగే విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమర యోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. నృత్యం, పప్పెట్ల తయారీ వంటి వాటిపై కూడా శిక్షణ ఇవ్వవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సమీప గ్రంథాలయాలను సంప్రదించాలి. వేసవి సెలవుల్లో పిల్లలు గ్రంథాలయాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్‌వీఎన్‌ఎస్‌వీ ప్రసాద్ కోరారు. విద్యార్థుల ఫోన్ నంబర్లు సేకరించి, నిత్యం శిక్షణకు వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, చిత్రలేఖనం వంటి అంశాల్లో స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ముందుకు రావాలని కోరారు. ఈ శిక్షణకు గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు దాదాపు రూ.12 లక్షలు కేటాయించారని, ఈ ఏడాది నిధుల కేటాయింపుపై ఉత్తర్వులు రావాల్సి ఉందని చెప్పారు.

అగ్గిరవ్వలు రగలనివ్వద్దు



- ఫైర్.. తీసుకోవాలి కేర్
- వేసవిలో అగ్ని ప్రమాదాల ముప్పు
- చిన్నపాటి ముందు జాగ్రత్తలతో నివారణ
- అవగాహనతో నష్టాలు దూరం

నిడదవోలు: వేసవి ఎండల తీవ్రత నానాటికీ పెరుగుతోంది. ఇంట్లో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల వాడకం గణనీయంగా పెరుగుతోంది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు కావడంతో కొన్ని ఇళ్లల్లో దాదాపు 24 గంటలూ ఏసీలు పని చేస్తూనే ఉన్నాయి. మరోవైపు చెట్లు చేమ, పొలాలు, గడ్డి, తాటాకు ఇళ్లు.. ఇలా ఆరుబయట ఉన్న అన్నీ ఎర్రటి ఎండకు ఎండిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితులన్నీ అగ్ని ప్రమాదాలకు ఆస్కారమిచ్చేవే. ఏమాత్రం చిన్న అజాగ్రత్తగా వ్యవహరించినా అగ్నిప్రమాదాల ముప్పు తప్పదు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను ముందస్తుగా నివారించే అవకాశం ఉంటుంది. ప్రాణ, ఆస్తి నష్టాల నుంచి బయటపడవచ్చును.

ప్రమాదాలకు అవకాశాలిలా..

- ఎండల తీవ్రతకు విద్యుత్ వినియోగం బాగా పెరుగుతోంది. దీంతో, ఓవర్ లోడుకు తట్టుకోలేని పాత విద్యుత్ వైర్లతో షార్ట్ సర్క్యూట్ల కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- ఎలక్ట్రిక్ హోల్డర్లు, ఇస్త్రీ పెట్టెలు, మిక్సీలు, వాషింగ్ మెషీన్లు వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినా, వాటికి ఉద్దేశించిన ప్లగ్‌లు వాడకపోయినా ప్రమాదాలు జరిగే చాన్స్ ఉంటుంది.
- భవనాల్లో హోమ్ థియేటర్స్, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటివి వాడేటప్పుడు కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడి ప్రమాదాల జరగవచ్చు.
- విద్యుత్ లైన్ నుంచి తాటాకు ఇళ్లకు నేరుగా వైర్లు లాగడం వలన కూడా ప్రమాదాలు జరుగుతాయి.
- సెలవులు తదితర కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంట్లోని విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయనందువలన ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు జరగవచ్చు.
- పల్లెల్లో చాలా మంది ఆరుబయట భోజనాలు వండుకునే క్రమంలో పొయ్యి వెలిగించి, ఇంట్లో టీవీ చూస్తూనో మరో పని చేస్తూనో ఉంటారు. అదే సమయంలో గాలి ఉధృతికి ఆ పొయ్యి నుంచి నిప్పురవ్వలు ఎగసిపడి తాటాకు ఇళ్ల వంటివి అగ్నికి ఆహుతి కావచ్చు. ఇటువంటి ప్రమాదాలు అనేకం జరుగుతున్నాయి.
- వంట పూర్తయిన తర్వాత పొయ్యిలో నిప్పులను పూర్తిగా ఆర్పకపోవడం.
- ఇంట్లో వంట పూర్తవగానే గ్యాస్ స్టౌ ఆఫ్ చేస్తారు. కానీ, సిలిండర్‌కు ఉన్న రెగ్యులేటర్ ఆఫ్ చేయరు. ఈ చిన్నపాటి నిర్లక్ష్యంతో ఒక్కోసారి వంట గ్యాస్ లీకై పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో చిమ్నీ లేని దీపాలు వాడటం వలన కూడా ప్రమాదాల జరగవచ్చు.
- అవగాహన లోపంతో పెంట కుప్పల్లో నిప్పులు వేయడంతో అవి గాలికి రాజుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఆరుబయట వేసిన మంటలను ఆర్పకపోవడం.
- కాల్చిన సిగరెట్లు, అగ్గిపుల్లలు ఆర్పివేయకుండా పడవేయడం కూడా ఒక్కోసారి పెద్ద ప్రమాదాలకు కారణమవుతుంది.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, పరిశ్రమలు, గిడ్డంగులు, ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలల్లో అగ్నిమాపక నిబంధనలు కచ్చితంగా పాటించాలి.
- పాత విద్యుత్ వైరింగ్ మార్చుకోవాలి.
- పాఠశాలల్లో ప్రమాదాలు జరిగేటప్పుడు విద్యార్థులు బయటకు వచ్చే మార్గాలను యాజమాన్యం ముందస్తుగానే ఏర్పాటు చేయాలి. పై అంతస్తు నుంచి కిందకు దిగేందుకు మెట్లు విశాలంగా నిర్మించాలి.
- పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ఫంక్షన్ హాల్స్, సినిమా థియేటర్ల యాజమాన్యాలు అగ్నిమాపక శాఖ నుంచి కచ్చితంగా నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలను నివారించడానికి అవసరమైన అన్ని పరికరాలనూ అందుబాటులో ఉంచుకోవాలి.
- వంట గదిలో అదనపు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్ లేకుండా చూసుకోవాలి.
- వంట పూర్తయిన వెంటనే సిలిండర్ రెగ్యులేటర్‌ను తప్పనిసరిగా ఆఫ్ చేయాలి.
- గ్యాస్ స్టౌను సిలిండర్ కంటే ఎత్తులో ఉంచాలి.
- వంట గదిలోకి వెళ్లేటప్పుడు నేరుగా కరెంటు స్విచ్‌లు వేయరాదు. గ్యాస్ వాసన వస్తోందేమో పరిశీలించాలి. అలా రాకపోతే స్విచ్ వేయవచ్చు. ఒకవేళ గ్యాస్ లీకయినట్లు అనుమానం వస్తే కిటికీలు, తలుపులు వెంటనే తెరవాలి. రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి.
- ఇల్లు వదిలిపెట్టి దూర ప్రాంతాలకు వెళ్లి, ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తే గ్యాస్ రెగ్యులేటర్‌ను తప్పనిసరిగా తీసివేయాలి.
- ప్రతి ఇంట్లో కనీసం 200 లీటర్ల నీరు అందుబాటులో ఉంచుకోవాలి.
- గ్రామీణ ప్రాంత్రాల్లో ఎండిన గడ్డిని వాములుగా వేయాలి. వాముల నుంచి ఇళ్లకు తప్పనిసరిగా 60 అడుగుల దూరం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో మంటలు వేయరాదు.
- పడుకునే ముందు వంట పొయ్యిని తప్పనిసరిగా ఆర్పివేయాలి.
- పూరిళ్లలో నివసించేవారు పొయ్యిలు, నిప్పులు పూర్తిగా ఆర్పివేయాలి.
- ఇళ్ల కప్పులు మరీ తక్కువ ఎత్తులో ఉండకుండా చూసుకోవాలి.
- నిద్రపోయే ముందు దీపాలు ఆర్పి, టార్చ్‌లైట్ అందుబాటులో ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు అందుబాటులో ఉంచరాదు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్ని ప్రమాదాల్లో గాయపడితే..

- అగ్ని ప్రమాదాల్లో కాలి, గాయపడిన వారి దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరుగెత్తనీయకుండా నేలపై దొర్లించాలి. అలా సాధ్యం కాకుంటే దుప్పటి చుట్టాలి.
- కాలిన శరీర భాగం మీద చల్లని నీరు పోయాలి.
- పొగతో నిండిన గదుల్లో మోచేతులు, మోకాళ్లపై పాకుతూ బయటకు రావాలి. ఆ సమయంలో నోటికి అడ్డంగా తడిగుడ్డ కట్టుకుని గాలి పీల్చడం ద్వారా పొగ, కార్బన్ డయాక్సైడ్ పీల్చకుండా ఆపవచ్చును.
- అగ్ని ప్రమాద సమయంలో బాత్ రూముల్లోకి వెళ్లకుండా ఆరుబయటకు వచ్చే ప్రయత్నం చేయాలి.

అత్యవసర ఫోన్ నంబర్లు

రాజమహేంద్రవరం	0883-2444101
ఆర్యాపురం	0883-2445101
నిడదవోలు	08813-221101
కొవ్వూరు	08813-231101
అనపర్తి	08857-227201
కోరుకొండ	0883-2496101
కాకినాడ	0884-2374571
పెద్దాపురం	08852-241299
పిఠాపురం	08869-251501
ప్రత్తిపాడు	08868-246709
తుని	08854-253601
జగ్గంపేట	08852-233388

వెంటనే స్పందిస్తాం



అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలోని ఏపీ విపత్తు స్పందన, అగ్నిమాపక కేంద్రాల్లో ఫైరింజన్లు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాయి. ప్రతి వాహనంలో 4,500 లీటర్ల నీటిని నిల్వ ఉంచి, ప్రమాదాల సమయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెళ్లి, మంటలను అదుపు చేస్తాం. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, కర్మాగారాలు, గిడ్డంగులు, ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలల్లో అగ్నిమాపక నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, ఏపీ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జిల్లా అధికారి, రాజమహేంద్రవరం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	23,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్



అమలాపురం టౌన్: స్థానిక సూర్యనారాయణపేటకు చెందిన 14 ఏళ్ల కుర్రోడు కోటుం కుమార్‌చందు శ్రీధర్ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలోని రోలర్ స్కేటింగ్ కోర్టులో శిక్షణ పొందుతున్న శ్రీధర్‌కు తొలిసారిగా కోనసీమ నుంచి అండర్ -14 విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో క్రీడా ప్రతిభ చూపే అవకాశం వచ్చింది. స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా శ్రీధర్‌ను జాతీయ పోటీలకు ఎంపిక చేసింది. ఈ నెల 29వ తేదీన న్యూఢిల్లీలోని జీఆర్ ఇంటర్నేషనల్ స్కూలులో గల స్కేటింగ్ రింగ్‌లో జరిగే జాతీయ స్కేటింగ్ పోటీల్లో తలపడనున్నాడు. గత సంవత్సరం కాకినాడలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో విజేత అయిన శ్రీధర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ పోటీల నిర్వహణలో కొంత జాప్యం అనివార్యం కావడంతో న్యూఢిల్లీలో జరిగే పోటీలకు ఇప్పుడు శ్రీధర్ కోచ్‌తో కలిసి బయలుదేరాడు. జాతీయ పోటీలకు వెళుతున్న శ్రీధర్‌ను స్థానిక బాలయోగి స్టేడియంలో శనివారం రాత్రి కోచ్‌లు, పీఈటీలు, క్రీడాకారులు సత్కరించారు. శ్రీధర్‌తోపాటు అతని తండ్రి ఆర్ అండ్‌బీ విశ్రాంత ఉద్యోగి కేఎస్ మూర్తిని కూడా అభినందించారు.

మాతృత్వానికి మరో మెట్టు!



తల్లిపాలు దానం చేసిన ఓ బాలింత

- జీజీహెచ్‌లో కొనసాగుతున్న మదర్ మిల్క్ బ్యాంక్ సేవలు
- ఫార్ములా ఫీడ్‌కు స్వస్తి చెప్పేలా పసిపిల్లలకు తల్లి పాలు
- తల్లి నుంచి పాలు పొందలేని శిశువులకు వరం
- ఏడాది కాలంలో 102 మంది పిల్లలకు తల్లిపాల ప్రయోజనాలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో తల్లిపాలు పొందలేని శిశువులకు పాలందిస్తూ ధాత్రి మదర్ మిల్క్ బ్యాంక్ విశేష ఆదరణ పొందింది. వందలాది శిశువుల తల్లిపాల ఆకలిని తీరుస్తూ పసిమొగ్గల పాలిట మరో అమ్మగా అవతరించింది. కాకినాడ జీజీహెచ్, సుషేణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధాత్రి మిల్క్ బ్యాంక్ 2023 ఫిబ్రవరిలో వెలసింది. నాటి నుంచి తల్లిపాల సంబంధిత సేవల్లో తరిస్తూ తల్లికి దిగులు లేకుండా, బిడ్డ పోషణకు లోటు రాకుండా ఎనలేని సేవలందిస్తోంది.

తల్లిపాలకు తల్లితో పనిలేదు

శిశువు తల్లిపాలు తాగేందుకు తల్లితోనే పనిలేదు. మరో తల్లి దానం చేసిన పాలను శాస్త్రీయ విధానంలో శుద్ధి చేసి, భద్ర పరిచి తల్లిపాలకు నోచుకోని పిల్లలకు అందిస్తారు. ఈ మదర్ మిల్క్ బ్యాంక్ ఎందరో పసిమొగ్గల జీవితాలను పౌష్టికం చేస్తోంది. ఫార్ములా ఫీడ్‌తో డబ్బా పాలకు స్వస్తి చెప్పడంతో పాటు భావితరాలలో పోషకాహార లోటును రూపుమాపడమే మిల్క్ బ్యాంక్ సేవల లక్ష్యం.

ఏడాదిలో 102 మంది పిల్లలకు

గడచిన ఏడాది కాలంలో జీజీహెచ్ మిల్క్ బ్యాంక్ ద్వారా 102 మంది శిశువులకు తల్లిపాలు అందించారు. తల్లి, తల్లి తరఫున కుటుంబ సభ్యులు లేదా వైద్య సిబ్బంది ఎవరు శిశువును మిల్క్ బ్యాంక్‌కు తీసుకువచ్చినా పాలు పడతారు. ఇంటి దగ్గర ఫీడ్ కోసం తల్లిపాలు అందిస్తారు.

శిశువులకు పాల లోటెందుకు...

పండంటి శిశువును ప్రసవించడం, ఆ శిశువుకి చనుబాలు అందిస్తూ తల్లిగా పునర్జన్మించడం ప్రతి స్త్రీకి ఓ వరం. అయితే, అమ్మగా మారిన ప్రతి మహిళకు అది సాధ్యం కాదు. అందుకు వివిధ కారణాలు దోహదపడతాయి. తల్లి అనారోగ్యానికి గురి కావడం, పోషకాహార లోపంతో బాధపడుతుండడం, హార్మోన్ల అసమతుల్యత, సిజేరియన్ డెలివరీ, తల్లిలో ఒత్తిడి, ఆందోళన, ఛాతి సంబంధిత శస్త్రచికిత్సల కారణంగా పాలు ఉత్పత్తి కాకపోవచ్చు లేదా తక్కువ మొత్తంలో ఉత్పత్తి అవ్వొచ్చు.

ఏడాది కాలంలో...

పాలు పొందిన శిశువులు – 102	
మదర్ బ్యాంక్ ప్రయోజనాలు అందుకున్న తల్లులు –	1,457
మిల్క్ బ్యాంక్ ద్వారా తమ పాలను తామే శాస్త్రీయ పద్ధతిలో చనుబాల నుంచి పొందినది	5,60,971 మిల్లీ లీటర్లు
మిల్క్ బ్యాంక్ ద్వారా సేకరించిన పాలు	55,765 మిల్లీ లీటర్లు
శిశువులకు అందించిన పాల మొత్తం	37,175 మిల్లీ లీటర్లు
తల్లులు సందర్శన	9,284
శిశువుల సందర్శన	621



పాల ఉత్పత్తికి చేసే వ్యాయామాలను బాలింతకు వివరిస్తున్న మిల్క్ బ్యాంక్ ఉద్యోగి

మిల్క్ బ్యాంక్ సేవలివీ...

మిల్క్ బ్యాంక్ శిశువులకు ప్రత్యక్షంగా తల్లిపాలు అందించడంతో పాటు తల్లిపాల సంబంధిత వివిధ సేవలు అందిస్తుంది. పాలు ఉత్పత్తి అయ్యేలా తల్లిని సిద్ధం చేయడం ఇందులో ఓ ముఖ్యమైన అంశం. అందుకు తల్లికి పలు వ్యాయామాలు బోధిస్తారు. తల్లులకు చనుబాల ప్రాధాన్యతను వివరించి తగిన మొత్తంలో ఉత్పత్తి కావడానికి అనుసరించాల్సిన విధానాలను వివరిస్తారు. అధికంగా పాలు ఉత్పత్తి అవుతున్న తల్లులను గుర్తించి, ప్రోత్సహించి తల్లిపాలు దానం చేసేలా అవగాహన కల్పిస్తారు. వార్డుల్లో ప్రసవం అయిన తల్లుల వద్దకు వెళ్లి వారు పిల్లలకు అందిస్తున్న పాలు ఏ స్థాయిలో ఇస్తున్నారు, ఇస్తే అవి శిశువుకి సరిపోతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి మరీ సేవలు అందిస్తారు. తల్లులకు కౌన్సెలింగ్ ఇస్తారు. వార్డులన్నీ తిరిగి బాలింతలను సమీపించి పాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతున్న వారికి అవగాహన కల్పించి బ్రెస్ట్ పంప్ ద్వారా సేకరిస్తారు. నెక్ మజాజ్, హాట్ వాటర్ ఫోమెంటేషన్, బ్రెస్ట్ మసాజ్ ప్రక్రియల ద్వారా తల్లికి పాల ఉత్పత్తి అవడానికి సహకరిస్తారు. జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, విద్యాలయాలకు వెళ్లి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ఈ కార్యకలాపాల నిర్వహణకు ఒక మేనేజర్ సహా ఇద్దరు కౌన్సిలర్లు, ఒక సపోర్టింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. వీరు కాక ఇంటర్న్‌షిప్‌కి వచ్చే విద్యార్థులు ఈ కార్యకలాపాలన్నింటిలో పాలు పంచుకుంటున్నారు.



బాలింతకు తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తున్న మిల్క్ బ్యాంక్ మేనేజర్ పక్కుర్తి శివమాధవ్

ఆరు నెలలు తాగితే జీవితకాలపు భరోసా



తల్లి పాలు బిడ్డకు ఆరు నెలలు పట్టిస్తే యావత్ జీవిత కాలం రోగనిరోధక శక్తి లభిస్తుంది. మరే ఆహారం వల్లా ఇంతటి ప్రయోజనం సాధ్యం కాదు. అధికంగా పాలు ఉత్పత్తి అయ్యే తల్లుల పాలు వృథా కాకుండా సేకరించడం, పాలు అందుకోలేకపోతున్న శిశువులకు అందించడమే మిల్క్ బ్యాంక్ విధి. తల్లిపాలందించి పసివాళ్లలో పోషకాహార లోపాన్ని రూపుమాపడమే లక్ష్యం. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ సహకారంతో సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. శిశువులకు పాలు కావాలనుకునే వారు, చనుబాలు దానం చేయాలనుకునే తల్లులు జీజీహెచ్‌లోని మిల్క్ బ్యాంక్ ప్రతినిధులను సంప్రదించవచ్చు.

– డాక్టర్ ఆమంచర్ల హర్షవర్ధన్, ధాత్రి మిల్క్ బ్యాంక్ కాకినాడ ఇన్‌చార్జి

జీజీహెచ్ నుంచి పూర్తి సహాయ సహకారాలు



ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న మిల్క్ బ్యాంక్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నాం. పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ ఈ సేవలను పర్యవేక్షిస్తున్నారు. డాక్టర్ హర్షవర్ధన్, మేనేజర్ మాధవ్ సంస్థ తరఫున ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తూ తల్లులు, శిశువులకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. అధునాతన పరికరాలతో శాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ పాలు శుద్ధి చేసి భద్రపరచడంలో నాణ్యతను కొనసాగిస్తున్నారు.

– డాక్టర్ ఎంపీఆర్.విఠల్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.40 లక్షల సొత్తు రికవరీ
- ఎస్పీ కృష్ణారావు వెల్లడి

అమలాపురం టౌన్: గడియ వేసి ఉన్న ఇళ్ల తలుపుల బోల్ట్‌లను తీయడంలో, ఐరన్ రాడ్‌లతో తలుపుల గెడలు తీయడంలో ఈ ముగ్గురు దొంగలు సిద్ధహస్తులు. ఇంట్లో వారు నిద్రిస్తుండగానే చడీ చప్పుడు లేకుండా చోరీ ముగించుకుని అక్కడ నుంచి జారుకుంటారు. తాము చోరీ చేయాల్సిన ఇంటి ప్రాంతంలో పగలు రెక్కీ నిర్వహిస్తారు. రాత్రి తాపీగా కారులో వచ్చి చోరీలకు పాల్పడుతుంటారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 32 చోరీలు చేసిన అంతర్రాష్ట్ర దొంగలు ముఠా ఇది. అమలాపురం పట్టణంలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో చోరీలు చేసిన ఆ ముగ్గురి దొంగలను పట్టణ పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.40 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చోరీల చిట్టాను వివరించారు. వీరి నుంచి రూ.40 లక్షల విలువైన 400 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు, అదే జిల్లా రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిషోర్‌బాబు అంతర్రాష్ట్ర దొంగలు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో తాము దొంగిలించిన సొత్తును నగదుగా మార్చుతున్న సమయంలో అమలాపురం పట్టణ పోలీసులు ఆదివారం ఉదయం అరెస్ట్ చేశారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబుతో కలసి ఎస్పీ కృషారావు ఈ చోరీల వివరాలను వెల్లడించారు.



చోరీల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాష్ట్రంలో 17 చోరీలు

తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ, నల్గొండ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డ వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 17 చోరీలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 15 చోరీలకు పాల్పడ్డారు. మొత్తం 32 చోరీ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. అమలాపురం పట్టణం గాంధీనగర్‌లో 2023 ఏప్రిల్‌లో మొదటి చోరీ, కురసాలవారివీధిలో 2024 ఆగస్టులో రెండో చోరీ, ఈ సంవత్సరం జనవరిలో మూడో చోరీ చేశారు. ఈ మూడు చోరీలకు సంబంధించి రూ.40 లక్షల సొత్తును రికవరీ చేశారు. నరసరావుపేటలో క్రికెట్ ఆటలో ఈ ముగ్గురికి పరిచయం ఏర్పడింది.

కేసును ఛేదించిన పోలీసులకు నగదు రివార్డులు

ఈ మూడు చోరీ కేసులను చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులు, క్రైమ్ పార్టీ సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. వారికి నగదు రివార్డులు అందజేశారు. పట్టణ సీఐ పి.వీరబాబు, క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, పట్టణ ఎస్ ఎస్ఆర్ కిషోర్‌బాబు, క్రైమ్ ఎస్సై రాంబాబు, ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు ఎంఎస్ రాజు, రమణ, కానిసాయి, శుభాకర్, ప్రసాద్, శ్రీనివాస్, అర్జున్, హరి, చిన్న ప్రసాద్‌లకు ఎస్పీ కృష్ణారావు నగదు రివార్డులు అందజేసి అభినందించారు.

యువకుడి దారుణ హత్య

- రాయి, ఇనుపరాడ్డుతో విచక్షణా రహితంగా దాడి
- నిందితులు నలుగురూ పరారు

కాకినాడ క్రైం: కాకినాడలో ఆదివారం ఓ హత్య జరిగింది. స్నేహితుల మధ్య చోటు చేసుకున్న ఓ వివాదం హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ సినిమా రోడ్డులో త్రీ టౌన్ పీఎస్ ఎదురుగా ఉన్న వీధిలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్న మీసాల గౌతమ్(25) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఓ యువతిని ప్రేమించి తల్లిదండ్రులతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లిపోయి, రేచర్లపేటలో గుర్రాల వారి వీధిలో యువతి ఇంట్లో నెల రోజులుగా ఆమెతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం యువతి ఇంటి నుంచి ఆటో నిలిపి ఉంచిన ప్రదేశానికి వెళ్లి స్టార్ట్ చేయబోతుండగా గౌతమ్‌కు తెలిసిన దుర్గాప్రసాద్, నవీన్, ఇమ్రాన్, సన్నీ అనే వ్యక్తులు ఆటో వద్దకు వచ్చారు. వారి మధ్య డబ్బుకు సంబంధించిన వాదన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ క్రమంలో చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీయగా నలుగురు యువకులు గౌతమ్‌పై దాడి చేశారు. రాయి, ఇనుపరాడ్డుతో విచక్షణా రహితంగా కొట్టడంతో గౌతమ్ అక్కడే కుప్పకూలిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన ప్రియురాలు గౌతమ్ సోదరికి ఫోన్ చేసి విషయం చెప్పగా కుటుంబీకులు వచ్చి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గౌతమ్ మరణించాడు. ఇదిలా ఉంటే కుటుంబీకులు గౌతమ్‌ది ఉద్దేశపూర్వక హత్యేనని ఆరోపిస్తున్నారు. నలుగురు యువకులు గంజాయి, మద్యం సేవించి మత్తులో తూగుతూ ఘాతుకానికి పాల్పడ్డారని గౌతమ్ తల్లి, సోదరి అంటున్నారు. తన బిడ్డను కడతేర్చిన దోషుల్ని కఠినంగా శిక్షించాలని తండ్రి కోరుతున్నారు. ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువకులు పరారీలో ఉన్నారని సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపారు. రెండు ప్రత్యేక బృందాలు విచారణ చేపడుతున్నాయని అన్నారు.



మీసాల గౌతమ్(ఫైల్)

20న సార్వత్రిక సమ్మె

రాజమహేంద్రవరం రూరల్: దేశవ్యాప్తంగా మే 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మెను ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సౌత్‌సెంట్రల్ జోన్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజమండ్రి మోడల్‌కాలనీలో ఎల్ఐసీ ఉద్యోగుల భవన్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి విస్తృత కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిషోర్‌కుమార్ మాట్లాడుతూ మే20న జరిగే సార్వత్రిక సమ్మెలో సుమారు 10 కోట్ల మంది కార్మికులు దేశ వ్యాప్తంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొని వచ్చిన 4 లేబర్ కోడ్‌లు, ప్రజా వ్యతిరేక ఆర్థిక నిర్ణయాలపై తమ నిరసన తెలుపుతామన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు నివాళులర్పించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఉగ్రవాదం అంతం చేయడానికి తీసుకొన్న అన్ని నిర్ణయాలను సమర్థిస్తున్నామన్నారు. రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు మాథ్యూస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి ఎస్.గనెయ్యా, ఓబీసీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి ఎ.కె.విశ్వనాథ్, రమేష్ బాబు, మహిళా కన్వీనర్ ఆర్.శిరీష , మచిలీపట్నం యూనియన్ సంయుక్త కార్యదర్శి కళాధర్, పీఎస్ఎన్ రాజులు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం సమ్మె విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. రాజమండ్రి డివిజన్ పరిధిలోని 20 బ్రాంచ్ ఆఫీసులలో పనిచేస్తున్న 100 మంది నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

విశిష్టమైనది సర్వ పృష్ఠ ఆప్తోర్యామ యాగం

టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్ట్ అధికారి యజ్ఞేశ్వర యాజులు

అంబాజీపేట: లోక కళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ 60 ఏళ్ల క్రితం నిర్వహించిన సర్వ పృష్ఠ ఆప్తో ర్యామ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర యాజులు చెప్పారు. తొండవరంలో వైనతేయ నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ ఉమా తొండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో ఆదివారం సర్వ పృష్ఠ ఆప్తోర్యామ యాగం ప్రారంభమైంది. యాగకర్తలుగా దువ్వూరి వెంకట సూర్యప్రకాశ యజ్వ, కనకదుర్గ సోమపీథిని దంపతులు వ్యవహరిస్తున్నారు. యాగ విశిష్టతను ప్రాజెక్ట్ అధికారి యాజులు మాట్లాడుతూ అగ్నిదేవుని ద్వారా సమస్త దేవతలకు హవిస్సు భాగం అందించేందుకు సర్వ పృష్ఠ ఆప్తోర్యామ యాగం ఉపయోగపడు పడుతుందన్నారు. యాగంలో (మహాగ్నిచయనం) భాగంగా ప్రత్యేక ఆకారాలు కలిగిన వేయి ఇష్టకాలను (ఇటుకలను) ప్రత్యేక మంత్రాలతో అమర్చుతామని, ఇలా పేర్చిన ఇటుకలన్నీ గరుడ పక్షి ఆకారాన్ని సంతరించుకుంటాయని యాజులు వివరించారు. ఈ యాగంలో సమస్త దేవతలను ఆహ్వానించి వివిధ హోమద్రవ్యాలతో వారికి హవిస్సు భాగాన్ని అందిస్తామన్నారు. ఇలాంటి యాగం తన తాత అయిన దువ్వూరి యజ్ఞేశ్వర పౌండరీక యాజులు 60 ఏళ్ల క్రితం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో నిర్వహించారని, ఇన్నాళ్లకు తన తండ్రి అయిన సూర్య ప్రకాశ సోమయాజులు నిర్వహించడం ఎంతో అరుదైన విషయమన్నారు. ఈ యాగంలో నమక చమకాలతో హోమం చేసి, పురుష సూక్తాలతో పరమాత్మను ధ్యానం చేస్తామన్నారు. ఈ క్రతువులో శతరుద్రీయహోమం (నమక ప్రశ్న) వల్ల ఘోర తనుకాంతి, వసోర్ధారా హోమం (చమక ప్రశ్న) వల్ల శాంతమైన తనువుకు ప్రీతి కలుగుతుందని యాజులు వివరించారు.



యాగంలో పాల్గొన్న పండితులు

అమావాస్య నాడు యాగ ప్రారంభం ఎంతో శక్తివంతం

ఎంతో విశేషమైన సర్వ పృష్ఠ ఆప్తోర్యామ యాగాన్ని చైత్ర బహుళ అమావాస్య రోజున ప్రారంభించడం వల్ల ఎంతో శక్తివంతంగా మారుతుందని, కోరికలన్నీ ఈడేరుతాయని యాజులు వివరించారు. సమస్త మానవాళి సుఖశాంతులతో ఉంటారని, వారి కోరికలన్నీ సిద్ధిస్తాయని, ముఖ్యంగా తమిళనాడులో ఏ పనైనా అమావాస్య నాడే ప్రారంభించి విజయవంతంగా ముగిస్తారన్నారు. సమస్త దేవతలకు కూడా హవిస్సు కేటాయిస్తారన్నారు. 10 రోజుల పాటు జరిగే ఈ యాగంలో వివిధ కార్యక్రమాలు, క్రతువులు ఉంటాయన్నారు.

తిరుమలలో అవగాహన సదస్సుకు మంచి స్పందన

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఈ సదస్సుకు సుమారు 15వేలమంది హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన పిల్లలు నిలబడాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను వారికి అందించాలి. అప్పుడే వారు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయగలుగుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కి దూరంగా ఉంచాలని అన్నారు. స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ అవసరంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినిదేవి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ప్రతి తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను వారికి అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు. తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల బుచ్చిబాబు, ఏఎస్‌వీ సత్యనారాయణ(నాని మాస్టారు) పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బిరదా అంజి (ఫైల్)

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడు వద్ద బైపాస్ రోడ్డుపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. దేవరపల్లి గ్రామానికి చెందిన దాసుదుర్గాప్రసాద్, బిరదాఅంజి, జాజుమొగ్గలసాయిచరణ్‌తేజ కలసి కాలినడకన ద్వారకాతిరుమల శనివారం సాయంత్రం వెళ్తుండగా మార్గమధ్యలో పుల్లలపాడు వద్ద రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బిరదా అంజి మృతిచెందగా, దుర్గాప్రసాద్, సాయిచరణ్ చికిత్స పొందుతున్నారు. మృతుడు అంజి మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వస్తున్న నలుగురు యువకులను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయ పడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన ఉందుర్తి బాలు, కరప మండలం గొల్లపాలెంకు చెందిన ఖండవిల్లి రాజా, అయినవిల్లి మండలం శంకరాయగూడెంకు చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, టి.కొత్తపల్లికి చెందిన బొమ్మి వినోద్ ఆదివారం యానాం నుంచి ఒకే మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా 216 జాతీయ రహదారి అన్నంపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఉమామహేశ్వరరావును ఇంటి దగ్గర దింపేందుకు వారు వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన వారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన యువకులు

పొలం తగాదాలో వ్యక్తిపై దాడి

పెద్దాపురం: వివాదంలో ఉన్న పొలంలో వరి పంట కోస్తుండగా... కోర్టు మాకు డిక్రీ ఇస్తే నువ్వు వరి కోత కొయ్యడమేమంటూ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఆదివారం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన తోగు జార్జి చక్రవర్తి 2.54 ఎకరాల వరి పంటను మెషీన్‌తో కోస్తుండగా పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కత్తితో దాడికి పాల్పడ్డారు. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో జార్జి ఇచ్చిన వాంగ్మూలం మేరకు పట్టణానికి చెందిన వెన్నా విజయచక్రవర్తి, పెదిరెడ్ల నాని, ఐతి మేరీ, ఆరెళ్ళి వీర్రాఘవులు, కొత్తపల్లి సాయికుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: వాడపల్లి గ్రామానికి చెందిన బొరుసు సూర్యచంద్రం 26వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని అతని భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. తన భర్త ఫైనాన్స్‌లో లారీ తీసుకుని ఇసుక రవాణాకు తిప్పుతున్నాడని పేర్కొంది. లారీకి రెండు వాయిదాలు బకాయి పడిన కారణంగా ఫైనాన్స్ కంపెనీకి చెందిన వ్యక్తులు ఇంటికి వచ్చి బకాయి అడుగుతున్నారు. 26వ తేదీ ఫైనాన్స్ వాయిదా సొమ్ము కట్టడానికి తనను రూ.20వేలు తక్కువ వచ్చాయని అడిగినట్లు పేర్కొంది. తాను సొమ్ము లేదని చెప్పగా శనివారం ఉదయం బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని పేర్కొంది. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని, పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులంక గున్నంమెరక గ్రామంలో ఓ బాలుడు విద్యుత్ షాక్‌కు గురై ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ ఫ్లెక్సీ కడుతుండగా గ్రామానికి చెందిన కోలా హేమంత్(16) ఒకసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతన్ని చికిత్స కోసం అస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడన్నారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.